


జనాలు నిద్రపోతున్నారు— నిలబడే నిద్రపోతున్నారు —కూర్చొనే నిద్రపోతున్నారు— మాట్లాడుతూనే నిద్రపోతున్నారు— ఆలోచిస్తూనే నిద్రపోతున్నారు. మొత్తానికి మేలుకొనే నిద్రపోతున్నారు— మరి ఆ అవస్థ నుండి బయట పడేదెప్పుడో?!

కొక్కొరో...క్కో...

కోడికూతతో చటుక్కున మెలకువ వచ్చింది వందరికి.

ముసుగు తీసేసి చుట్టూ చూశాడు. అంతా మసకగా ఉంది— చీకట్లు ఇప్పుడిప్పుడే ఆ ప్రదేశాన్ని వీడిపోతున్నాయి. ఆకాశంలో పక్షుల గుంపులు ఆహారాన్వేషణకు అప్పుడప్పుడే బయలు దేరినట్లున్నాయి.

. నెమ్మదిగా లేచి కాలకృత్యాలు ముగించుకుని గుడిసెలోని కెళ్లాడు

ఆ చీకట్లోనే తడుముకుంటూ వెళ్లి తనకు రోజూ జీవనోపాధి చూపుతున్న పాతపిట్టల వలను తీసుకుని బయటికి వచ్చాడు.

గుడిసె అరుగు మీద చతికిలబడి ఆ వల మడతలు విప్పాడు. అది అక్కడక్కడ చిరుగులు పడి ఉంది. ఆ మసక వెలుతురులో కనిపిస్తున్న ఆ చిరుగులను అల్లడం మొదలు పెట్టాడు.

ఎన్ని అల్లినా ఇంకా చిరుగులు తొంగిచూస్తూనే ఉన్నాయి.

ఛ! దీనికి గిన్ని తూట్లున్నాయ్ —ఇగ చిక్కమంటెట్ల చిక్కుతయ్! నిన్నందుకే గన్ని తప్పించుకున్నయ్! క్రితం రోజు ఖాళీగా వెక్కిరించిన బుట్ట గుర్తొచ్చి బాధగా అనుకున్నాడు.

నిన్నంత దండుగల బతుకయిపాయె!

ఇయ్యాల అంగడి!....ఇయ్యాలన్న జెరన్ని దొర్కుతె మంచిగుండు —అంగట్ల గిరాకెక్కువై తది.

చిరుగులన్నీ పూర్తయ్యేసరికి తూర్పున సూర్యుడు తొంగి చూస్తున్నాడు.

గబగబా స్నానం అయ్యిందనిపించి గుడిసె లోపలికెళ్లాడు.

అప్పటికే అతని భార్య వేటకు సామానంతా సిద్ధం చేసి ఉంచింది.

వెంకటేశ్వర స్వామి పటం ముందు నిలబడి సామీ! ఇయ్యాలన్నన్న నాల్గు పైసలొచ్చేతట్టు సూడుసామీ! అని మనసులో అనుకుని, కుంకుమ కొంచెం నుదుట రాసుకుని దండం పెట్టుకున్నాడు. బుట్టలో సామానంతా ఉందో లేదో అని ఓసారి చూసుకుని బుట్టను భుజానికే సుకుని బయలుదేరాడు.

క్రితం రోజటి ప్రదేశాన్ని దాటి రెండు ఫర్లాంగుల దూరం ముందుకెళ్లి అనువైన ప్రదేశాన్ని చూసుకుని బుట్టను కిందికి దించాడు. బుట్టలో నుండి వలను బయటికి తీసి ఓసారి కళ్లకద్దుకుని విప్పి పరిచాడు. వలకున్న తాడును దగ్గరలోని ఒక పొదకు కట్టివేశాడు. పక్షులు ఐకమత్యంతో ఆలోచిస్తేనో! —ముందు చూపన్నమాట.

బుట్టలోంచి కొన్ని గింజలు తీసి వలపై చల్లాడు.

ఏర్పాట్లు సరిగా ఉన్నాయో లేవో ఓ సారి చూసుకుని దగ్గరలోని గుబురు పొదల చాటున కూర్చున్నాడు— పక్షులకోసం చూస్తూ

దాదాపు ఓ గంట సమయం గడిచిందేమో— ఓ పక్షుల గుంపు ఆవైపు రావడం గమనించాడు పండరి. ఆశగా చూశాడు —కిందికి దిగుతాయేమోనని

కానీ అవి కిందికి చూడనుకూడా చూడకుండా ఆ ప్రదేశాన్ని దాటిపోయాయి.

కసిగా నేలను ఒక్కతన్ను తన్నాడు

కిందికి దిగితేదో గంటంత వోయినట్టు వురుకుతున్నయ్, దిగితేమన్న నొప్పా!...దొంగముండయి.

గింజలు కనిపించడం లేదనుకున్నాడో ఏమో! ఇంకొన్ని తీసుకెళ్లి చల్లి వచ్చాడు.

మరోగంట గడిచి పోయింది —పక్షుల జాడ లేదు.

★

కోలాహలం... కోలాహలం...

వూరు వూరంతా సందడిగా ఉంది. ఊరంతా భారీ కటౌట్లు, బ్యానర్లు, వాల్‌పోస్టర్లు, గోడల మీది రాతలు, మైకుల హోరు —ఈ హడావిడంతా చెప్పకనే చెబుతుంది— ఏదో ఎన్నికల సందడని.

జీపులూ, కార్లూ, వ్యాన్లూ వస్తున్నాయ్ — పోతున్నాయ్ ఎన్నడూ కనబడని కొత్త మొహాలూ తిరుగాడుతున్నాయి.

ఖద్దరు రెక్కల రాజకీయ పక్షులైతే ఎగురుతున్నాయ్, దూకుతున్నాయ్, దొర్లుతున్నాయ్ — అది వాళ్ల సీజను కదా!

ఊరి మధ్యలో గాంధీ బొమ్మ దగ్గర ఓ రాజకీయ నాయకుడు గొంతు చించుకుంటున్నాడు.

మహాజనులారా! మీ అందరికీ నా వందనములు. అన్నల్లారా! తమ్ముల్లారా! అక్కల్లారా! చెల్లెల్లారా!...నేను రాజకీయాల్లో కొచ్చింది ఏదో స్వలాభం ఆశించికాదు— కేవలం ప్రజాసేవ చేయాలనే సదుద్దేశంతోనే!... ఆ ఉద్దేశంతోనే పోయిన ఎన్నికలలో పోటీ చేశాను. కానీ మీరు నన్నూ నా ఆశయాన్ని గుర్తించలేదు —ఓడిపోయాను. అయినా నాకు బాధలేదు. ఎందుకంటే ప్రజలారా! ఇది ప్రజాస్వామ్యం, మీకు ఎవరినైనా ఎన్నుకునేందుకు స్వతంత్ర్యం ఉంది. —ఆ స్వతంత్రంతోనే మీరు అవతలి వ్యక్తిని ఎన్నుకున్నారు —అతనిపై నమ్మకమేర్పడి కావొచ్చు. కానీ మీ నమ్మకాలను అతడు ఏ విధంగా వమ్ము చేశాడో నేను ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదనుకుంటా. అయ్యల్లారా! గడిచిన ఐదేళ్లలో మన నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఏమిటయ్యా అంటే గెలిచిన ఎంఎల్ఏ ఆస్తులు పదింతలు పెరగడమే తప్ప ఏ ఇతర అభివృద్ధీ పట్టపగలు దివిటీ పెట్టి వెతికినా కనపడదని బల్లగుద్ది మరీ చెబుతున్నా!... అయ్యా ప్రజాసేవే లక్ష్యంగా ఉన్న వాళ్లెవరూ ఆ విధంగా నీతికి నీళ్లొదరరని మరో సారి మనవి చేస్తున్నా!

....దేశానికి వెన్నుముకయిన రైతన్నలు వర్షాలులేక —ప్రకృతి వైపరీత్యాలతో పడే అవస్థలు చూస్తుంటే హృదయమున్న ఏ మనిషైనా స్పందించక మానడు —కానీ ఆ ఎంఎల్ఏ హైదరాబాద్‌లో రాచమర్యాదలతో తేలియాడుతుంటే వీళ్ల ఆక్రందనలు అతడి చెవికెలా చేరుతాయ్?... వీళ్ల బాధలెలా తీరుతాయ్?

సభలో ఉన్న రైతుల్లో కలకలం. తమ బాధలను ఇంతబాగా అర్థం చేసుకున్నాడా అనేటటువంటి ఆశ్చర్యంతో కూడిన భావం వాళ్ల మొహాల్లో కదలాడుతుంది— దేశానికి వెన్నుముకలైన ఆ రైతన్నల వెన్నులు కాస్త నిటారయ్యాయి.

అప్పుడే గనక నేను ఎన్నికయి ఉంటే ఉచితంగా కరెంటు ఇప్పించే ఏర్పాటు చేసి ఉండే వాడిని, కానీ ఏమీ చేయలేక పోయానే అనే బాధ నన్ను తొలచివేస్తుది...

వలను నేర్పుగా పరిచేస్తున్నాడు... ఎంత నేర్పరితనమో చూశారా!... రాజకీయ పాఠాల్లో వాళ్లు నేర్చిన మొట్ట మొదటి పాఠాలివే కాబోలు.

....అయినా మించిపోయిందేమీ లేదు. ఈ సారి ఆ కోరిక తీర్చుకోవచ్చుగదా అనే ఆశ ఆ బాధను మరుగున పడేస్తుంది. ఈ సారి నేను గనక గెలిస్తే —రైతులందరికీ కరెంటు చార్జీలు కట్టే అవసరమే లేకుండా చేస్తాను... అయ్యల్లారా ఇదంతా ఏదో లాభం ఆశించి చెప్పే మాటని పొరబడేరు. ప్రజాసేవ నా కర్తవ్యం, నా ఊపిరి కాబట్టి —ప్రజలకు నా శాయశక్తులా మేలు చేయాలనే ఉద్దేశంతో వచ్చిన మాటలని మనవి చేస్తున్నా!

గవర్రాజు గారు జిందాబాద్, కాబోయే ఎంఎల్ఏ గవర్రాజుగారు జిందాబాద్

రైతులు ఆనందాన్ని పట్టలేక పోతున్నారు.


చిరునవ్వుతో నిశబ్దంగా ఉండమని సైగచేసి తన ప్రసంగాన్ని తిరిగి కొనసాగించాడు.

రైతుల పరిస్థితి ఈ విధంగా ఉంటే— నిరాశా, నిస్పృహలతో బాధపడే నిరుద్యోగ యువతను చూస్తుంటే ఒకప్పుడు అదే స్థితిలో ఉన్న నాకు ఎదురైన అనుభవాలు గుర్తొస్తున్నాయి. అలాంటి అనుభవాలు నా సోదరులకు ఎదురు కాకూడదనే నేను ఆశించేది. యువత పెడదారిన పడకూడదనే నేను కోరుకునేది. రాష్ట్రంలోని అందరు నిరుద్యోగులకు నేను మేలు చేయలేక పోవచ్చునేమో కానీ మన నియోజకవర్గ నిరుద్యోగులకు మాత్రం ఉపాధి కల్పించడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తా, మన నియోజకవర్గాన్ని అతి చక్కని ఇండస్ట్రియల్ ఎస్టేటుగా తీర్చిదిద్దడానికి నా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఈ సభాముఖంగా హామీ ఇస్తున్నా! ఇప్పటికే చాలా మంది పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలు స్థాపించడం కోసం ముందుకొస్తున్నారు. నే గెలిస్తే మాత్రం ఆ ఎస్టేటును సాధించి తీరుతానని యువతను నిరుద్యోగ కోరల్లోంచి విముక్తిని కలిగిస్తానని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్నా!



కస్టమర్ : ఏమండీ మేనేజర్‌గారు మీరు మురికి నీళ్ళు సప్లయ్ చేస్తున్నారేమిటీ? అని రామారావు హోటల్ మేనేజర్‌ను అడిగాడు.
మేనేజర్ : మీరు చాలా పొరపాటుపడ్డారు సార్! నీళ్ళు మురికిగా లేవండీ గ్లాసులు మురికిగా ఉండటంతోనే మీకు అలా అనిపిస్తుంది.
కస్టమర్: ఆ....!!!

ఎం.డి. రియాజ్, గుంటూరు



సుబ్బారావు: ఒరే కుటుంబరావు! రోజు మీ ఆఫీసరు తిట్టేతిట్లకు సిగ్గేయడం లేదంట్రా!
కుటుంబరావు: మా ఆవిడ తిట్లకు అలవాటుపడ్డాన్రా
సుబ్బారావు: ఆ!

వినీత, వరంగల్

వహ్వా!... గింజలు కూడా బేషుగ్గా చల్లేస్తున్నాడు. ఈ విషయంలో మాత్రం నిజంగా మెచ్చుకుతీరవల్సిందే.

అశా— నిరాశల మధ్య కొట్టుకుంటున్న భావం యువకుల ముఖాల్లో చోటుచేసుకుంది.

మనకు ఎన్నాళ్లనుండో ఉన్న కోరిక —డిగ్రీ కాలేజీ కావాలని, అది కూడా నేను నా స్వంత బాధ్యతగా నెరవేరుస్తానని హామీ ఇస్తున్నా!.... ఒకప్పుడు నేనూ పట్టణంలో ఉంటూ చదువుకున్న వాడినే... ఆ బాధలేమిటే నాకూ తెలుసు. ఇక పోతే మంచినీటి గురించి— రాష్ట్రంలో మరెక్కడా లేనంత నీటి కొరత మన నియోజక వర్గంలో ఉంది. అయినా ఇవన్నీ వాళ్లకు పట్టవు— వాళ్లకు తమసేవే ముఖ్యం గనక. నే గెల్చిన తర్వాత ఎలాంటి ఇబ్బందులెదురైనా సరే— వీధికో బోరింగు వేయించి నీళ్ల కరవు నివారించే పూచీ నాదని మనవి చేస్తున్నా!

అందరి మొహాల్లో భావాలను చదువుతున్నాడు. లాభంలేదు —పెద్ద రియాక్షనేమీ కనిపించడం లేదు బ్రహ్మాస్త్రం ప్రయోగించాలి —తప్పదనుకున్నాడు.

ప్రజలారా!....నేను ఈ ప్రచార సభకు వస్తున్న తోవలో నాకు ఎదురైన దృశ్యాలు నా హృదయాన్ని కదిలించి వేశాయి. ఇళ్లు లేక రోడ్ల ప్రక్కన, మురికి కాలువల పక్కన నివసిస్తున్న నా ప్రజల దయనీయ స్థితి... ఓహ్! ఎలా చెప్పాలి...మన దేశ ప్రగతంతా ఏమైపోతుంది. ప్రగతంతా ఎవరి బతుకుల్లో!? అనే ఆలోచన మొదలయ్యింది. తోటి పౌరుడిగా నాకు తోచిన సాయం చేయాలనే ఆలోచన వచ్చింది. అప్పుడే ఓ నిర్ణయానికి కొచ్చేశాను. ఊరవతల ఉన్న నా 50 ఎకరాల భూమిని ఇళ్లు లేని నిరుపేదలకు పంచిపెట్టి, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రేపటి నుండి మా మనుషులు ఇళ్లు లేని వాళ్ల వివరాలు సేకరించే కార్యక్రమం చేపడుతారు. మీరంతా వాళ్లతో సహకరించాలని మనవి చేస్తున్నా! ఇదంతా నేను ఎన్నికలలో గెలవడానికి చెబుతున్న బూటకపు మాటలని భ్రమ పడవద్దు సూమా! ఈ గాంధీ తాత మీద ప్రమాణం చేసి మరీ చెబుతున్నా—నే గెలిచినా గెలవకపోయినా ఈ పంపకం మాత్రం జరిగి తీరుతుంది.

కీలెరిగి వాతపెట్టడమంటే ఇదే కాబోలు.

ఆలోచించు

జయజయధ్వానాలు ఆకాశాన్నంటాయి. అందరి హృదయాల్లోనూ ఆనందపు జల్లులు కురుస్తున్నాయి. వాళ్ల ఆలోచనలు కొత్త లోకాలను తాకుతున్నాయి. యిప్పుడందరి ఆలోచనల్లో కాబోయే ఎమ్మెల్యే గవర్రాజే.



ఆశ్చర్యం, నీతోటి ఉద్యోగులందరికీ కంటి అద్దాలు వచ్చాయి నీకు మాత్రం రాలేదేంటిరా సుబ్బారావు?
వాళ్ళు వట్టి వెధవలు, అస్తమానం ఫైళ్ళలో తలదూర్చి కళ్ళుబలహీనం చేసుకున్నారు. నేను ఆఫీసులో రోజంతా కళ్ళు మూసుకుని విశ్రాంతి కల్పిస్తుంటాను.

వరలక్ష్మి, శ్రీకాకుళం

వాళ్ల ముఖాల్లో కదలాడే భావాలను చూసి మురిసిపోయాడు —అట్లాంటి రియాక్షనే తనకు కావాల్సింది. దానికోసమే అతడు ఐదు సంవత్సరాలు ఓపికపట్టింది.

తనకిక ఢోకాలేదు —గెలుపిక తనదే —వాళ్లందరినీ చూసి తృప్తిగా నవ్వుకున్నాడు. అతనిలో పలి ఇంకో గవర్రాజు వికృత నవ్వుతో మీసం మెలి వేస్తున్నాడు.

వలలో చిక్కుతున్న పావురాలను చూసి వేటగాడు నవ్వుకునే నవ్వులాంటిదేనా అది?!

* * *

మధ్యాహ్నం పన్నెండు గంటలు.

ఎండ తీక్షణంగా ఉంది.

పండరి సహనం చచ్చిపోతోంది —అప్పటికింకా 'బోణీ' కాలేదేమో!

దూరంగా ఓ పక్షుల గుంపు రావడం కనిపించింది. పండరి హృదయం ఉత్సాహాన్ని నింపుకుంది. ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు. దగ్గరగా వచ్చింతర్వాతగానీ గమనించలేదు —అవి నల్లని పావురాలని. ఎగిరి గంతేయాలనిపించింది.

'అవన్ని పడాలెగానీ! నాసామిరంగా! పైసలే పైసలు!

పాపం! తిరిగీ తిరిగీ తినడానికేం దొరకక అల్లాడుతున్నాయి కాబోలు ఇంకేమీ ఆలోచన లేకుండా వలపై వాలిపోయాయి.

పాపం!! చిక్కిపోయాయి. వురితాడు వాటంతటవే మెడకు బిగించుకున్నాయి.

ప్రాణభీతితో కొట్టుకుంటున్నాయి. గింజుకుంటున్నాయి —అయినా ఇప్పుడేం లాభం?

పండలి మెల్లిగా దగ్గరికెళ్లాడు, తొమ్మిది పావురాలు —తృప్తిగా నవ్వుకున్నాడు.

గవర్రాజు నవ్వూ, ఈ నవ్వూ ఒకటేనా!?

ఒక్కొక్క పావురాన్ని తీసి కాళ్లు కట్టేసి బుట్ట లోకి జారవిడుచుకున్నాడు. వలను మడిచి బుట్టలో పెట్టుకుని, బుట్టను బుజానేసుకుని బయలుదేరాడు —పావురాలను డబ్బు రాళ్లుగా మార్చడానికి.

విజయోత్సాహంతో అతని మనస్సు గంతులేస్తోంది.

గెలిచాడు, ప్రకృతి రాజకీయంలో పండరే గెలిచాడు. ప్రకృతి రాజకీయంలో గెలుపెప్పుడూ అతడినే వరిస్తుంది —ఎందుకూ? పక్షులు ఆలోచించలేవు గనక.

అంగట్లో పెట్టిన అరగంటలోపే బుట్ట ఖాళీ —జేబు మాత్రం నిండింది.

అయిపోయింది.

తన స్వార్థం కోసం నిండు ప్రాణాలను నడిబజారులో నిర్దాక్షిణ్యంగా వేలం వేశాడు.

ప్రాణాల్ని ప్రాణంలేని కాగితాలతో ఖరీదు కట్టాడు.

వాటి ప్రాణాలు కాగితాల రూపంలో పండరి జేబులోంచి తొంగి చూస్తున్నాయి.

ఘోరం కదూ!?

* * *

గెలిచాడు.

—వికృత రాజకీయంలో ఎత్తుల జిత్తుల రాజకీయ వేటగాడు గెలిచాడు.


గెలుపెప్పుడూ వాళ్ల మొలతాడుకు కట్టిన తాళం చెవే —నేర్పుగా వల విసరడం ఆ జాతి లక్షణం గదా!

చిక్కిపోయారు —అతి చాకచక్యంగా విసిరిన రాజకీయపుటెత్తుల వలలో జనాలు గుడ్డిగా చిక్కారు —వేటగాని వలలో పావురాలు చిక్కినట్టు.

పావురాలు కుయుక్తులు తెలియక చిక్కిపోయాయి —అమ్ముడుపోయాయి —మరి వీళ్లో?!

విజయోత్సాహంతో గవర్రాజు గెంతుతున్నాడు, ఊగుతున్నాడు, మైకంతో పొర్లుతున్నాడు, ఆనందంతో ఊరేగుతున్నాడు—

ఆ తర్వాత——?!!



ఫోర్జరీ కేసులో పోలీసులకు పట్టుబడి ఆ రోజే విడుదల అవుతున్నాడు పాపారావు. ఇన్స్పెక్టర్ అతనితో ఈ ఫోర్జరీలు మానుకుని బుద్ధిగా బతుకు అంటూ చెప్పుతూ రిజిస్టర్‌లో సంతకం చేయమని చెప్పాడు. సరేసార్... ఎవరి సంతకం చేయాలి.

సత్య, ముదునూరు